సాక్షి మంచిర్యాల

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



'శుభ' విరామం

శుభాకార్యాలకు నేటి నుంచి బ్రేక్ పడనుంది. గురుమూఢం ప్రారంభంతో జూలై 8 వరకు ఎలాంటి ముహూర్తాలు లేవని వేద పండితులు పేర్కొంటున్నారు. 8లో▸



సుర్రుమంటున్న సూరీడు

భానుడి ప్రతాపంతో జిల్లావాసులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఎండల తీవ్రతకు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 దాటితే చాలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
43.0 /29.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, సబ్ జైల్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలెబుల్ వారంట్, ఖైదీల కేసుల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. ఇందులో జిల్లా న్యాయమూర్తులు అర్పిత మారంరెడ్డి, కే. నిరోషా, స్థానిక ఏసీపీ ప్రకాశ్, జిల్లా ఎక్సైజ్ అధికారి నందగోపాల్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ సంతోష్, లక్సెట్టిపేట సబ్ జైలు సూపరింటెండెంట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులకు ప్రాణహాని తలపెట్టొద్దు



మాట్లాడుతున్న రేంజర్ రవి

కోటపల్లి: ఏనుగులకు ఎలాంటి ప్రాణహాని తలపెట్టవదని, వాటి గుంపు కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం అందించాలని ఫారెస్ట్ రేంజర్ రవి అన్నారు. ఏనుగుల గుంపులు మహారాష్ట్ర సరిహద్దు నుంచి ప్రాణహిత తీరం మీదుగా తెలంగాణ సరిహద్దు గ్రామాలైన కోటపల్లి మండలం అటవీ ప్రాంతంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయనే సమాచారం మేరకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ మేరకు స్థానిక అటవీశాఖ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. ఏనుగులు అటవీ ప్రాంతాల్లోనే ఉండేలా తాగునీరు, ఆహారం వంటివి అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. భద్రతా వాహనాలు, డ్రోన్‌లు నైట్‌విజన్ పరికరాల ద్వారా వన్యప్రాణుల కదలికలను గుర్తిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో భూమన్న, పశువైద్యాధికారి పవన్‌కుమార్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై నిషేధాజ్ఞలు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపెల్లి జిల్లాల పరిధిలో డ్రోన్‌ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన వీవీఐపీ, వీఐపీలు హెలికాప్టర్ల ద్వారా రాకపోకలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో డ్రోన్‌ల వినియోగం వల్ల అంతరాయం, భద్రత దృష్ట్యా సమస్య తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'పెద్దపల్లి ఎంపీ స్థానం కాంగ్రెస్‌దే'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మంచిర్యాలటౌన్: ఈ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ స్థానం కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకుంటుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న తన కుమారుడు గడ్డం వంశీకృష్ణకు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. అందరి మద్దతుతో భారీ మెజారిటీ సాధించి విజయం అందుకోవడం ఖాయమని స్పష్టం చేశారు. ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల ద్రోహి బీఆర్ఎస్ అని, దళితుల ద్రోహి బీజేపీ అని అన్నారు. తనను గెలిపిస్తే సింగరేణి కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు, వారి హక్కులను కాపాడేందుకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య, వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపు జు రమేశ్, నేతకాని సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు దుర్గం నరేశ్, రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాకతోనే అభివృద్ధికి నాంది



మంచిర్యాల సభలో అభివాదం చేస్తున్న దీపాదాస్ మున్షి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, మక్కాన్‌సింగ్, వివేక్ వెంకటస్వామి తదితరులు

- రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు
- మంచిర్యాలలో ప్రజా ఆశీర్వాద సభ



మంచిర్యాల సభలో పాల్గొన్న ప్రజలు

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం వంద రోజుల్లోనే అభివృద్ధికి నాంది పలికామని, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంతో పాటు, తాగునీటి సమస్యలను తీరుస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలో భాగంగా ఇప్పటికే ఐదింటిని అమలు చేస్తున్నామని, పేదలకు ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని జూన్ 6 తరువాత మొదలు పెడతామన్నారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీనే ప్రధాని కాబోతున్నారని, సింగరేణిలో కొత్త బొగ్గుగనులను తీసుకురావడంతో పాటు, మంచిర్యాలను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. ఈ ఎన్నికల్లో యువతను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చిందని, యువకుడైన వంశీని గెలిపిస్తే, యువతకు అండగా నిలుస్తాడన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరి, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, మక్కాన్ సింగ్ ఠాకూర్, వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, చిట్ల సత్యనారాయణ, కొండ చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్ పాల్గొన్నారు.

'నల్లధనం' హామీ విస్మరించిన మోదీ సర్కార్

- దీపాదాస్ మున్షి

నస్పూర్: తాము అధికారంలోకి వస్తే నల్లధనాన్ని వెలికితీస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి అన్నారు. పట్టణ పరిధిలో శనివారం నిర్వహించిన పెద్దపల్లి పార్లమెంట్ కార్మిక గర్జన సభలో ఆమె ప్రసంగించారు. దేశంలోని రూ.2లక్షల కోట్ల నల్లధనాన్ని వెలికితీసి ఒక్కో పేద కుటుంబం అకౌంట్‌లో రూ.15 లక్షలు జమ చేస్తానని 2014 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ఆమె ప్రశ్నించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సింగరేణిని కాపాడింది కాంగ్రెస్సే..

నస్పూర్: సింగరేణి సంస్థను కాపాడింది కాంగ్రెస్ పార్టీనే అని మంచిర్యాల, చెన్నూర్ ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కార్మిక గర్జన సభను పట్టణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నష్టాల్లో ఉన్న సింగరేణికి వడ్డీలేని రూ.450 కోట్ల రుణాన్ని తీసుకువచ్చి సంస్థను కాపాడిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 62 వేల మంది ఉన్న కార్మికులను 39 వేలకు తగ్గించారని తెలిపారు. ఇక బీజేపీ హయాంలో నిత్యావసరాల ధరలు పెరిగాయని విమర్శించారు. ఆ పార్టీ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ పేదలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. సింగరేణిలో ఉద్యోగ అర్హత వయస్సు 40ఏళ్ల పెంపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఎన్నికలు ముగిసిన వెంటనే అమలు చేస్తామని తెలిపారు. అలాగే రిటైర్డ్ సింగరేణి కార్మికులకు రేషన్ కార్డులు ఇప్పించేందుకు కృషి చేస్తామనని పేర్కొన్నారు. ఈ ఎన్నికలలో వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇందారం క్రాస్ రోడ్డు నుండి బైక్ ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు.



మాట్లాడుతున్న కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

అత్యధిక నిధులు తీసుకువస్తాను

తనను ఎంపీగా గెలిపిస్తే నియోజక వర్గ సమస్యలు పార్లమెంటులో ప్రస్తావించి వాటి పరిష్కారంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు తీసుకువస్తానని గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ చైర్మన్ సురమిల్ల వేణు,వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, కౌన్సిలర్లు శీపతి సుమతి, బొద్దున సంధ్యారాణి, తోట శ్రీనివాస్, బండి పద్మ, అగల్ డ్యూటీ రాజు, పట్టణ అధ్యక్షుడు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి



కంట్రోల్ రూమ్ పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు రావేశ్‌గుప్తా, కలెక్టర్ సంతోష్

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు రావేశ్‌గుప్తా

మంచిర్యాలఅగ్రికల్చర్: లోక్‌సభ ఎన్నికల్లో నిబంధనల ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రావేశ్‌గుప్తా అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బి.సంతోష్, డీసీపీ అశోక్‌కుమార్, మంచిర్యాల ఆర్డీవో రాములతో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, సి-విజిల్, వీడియో పరిశీలన, ఎంసీఎంసీ, వెబ్ కాస్టింగ్, మీడియా సెంటర్లను శనివారం తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జూన్ 6 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. కంట్రోల్ రూమ్, సీ-విజిల్, టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా అందిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, కార్మికశాఖ కమిషనర్ వినీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు రావేశ్ గుప్తా తెలిపారు. ఇందులో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, తహసీల్దార్ శ్రీనివాస్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

ఎన్నికలు సజావుగా సాగేందుకు అవసరమైన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల రక్షణకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు రావేశ్‌గుప్తా తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన..

బెల్లంపల్లి/కోటపల్లి/చెన్నూర్‌రూరల్/జైపూర్: బెల్లంపల్లిలోని బజారు ఏరియా జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌లతో పాటు పలు పోలింగ్ కేంద్రాలను రావేశ్ గుప్తా పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. కోటపల్లి మండలంలోని నక్కలపల్లి, మల్లంపేట, చెన్నూర్ మండలంలోని కిష్టంపేటలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. జైపూర్‌లో గల 91, 92, 93 నంబర్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు.

లెక్కింపు కేంద్రాన్ని సిద్ధం చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంను కలెక్టర్ సంతోష్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాహుల్, డీసీపీ అశోక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలను, లెక్కింపు గదుల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏఆర్వో రాములు, చెన్నూర్ ఏఆర్వో చంద్రకళ తదితరులున్నారు.

తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది బీఆర్‌ఎస్సే

- పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

నస్పూర్: తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని పార్టీ జిల్లా బీ ఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ పరిధిలోని జిల్లా కార్యాలయం వద్ద పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు నడిపల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యతో కలిసి పార్టీ జెండాను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 14 ఏళ్ల పాటు అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. దేశంలోనే తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా నిలిపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ దేనని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

రామకృష్ణాపూర్: తెలంగాణ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఢిల్లీలో కొట్లాడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిలకడ, నిబద్ధత లేని రాజకీయ నాయకులు వివేక్ కుటుంబసభ్యులు అని విమర్శించారు. కేవలం వారి ఆస్తులను కాపాడుకోవడానికే రాజకీయాలను వాడుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణి ప్రాంత సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న ఈశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు.



జెండా ఆవిష్కరిస్తున్న సుమన్, పక్కన ఈశ్వర్

గనులు, డిపార్ట్‌మెంట్లపై ప్రచారం..

ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ రామకృష్ణాపూర్‌లో విస్తృతంగా పర్యటించారు. ఉదయం ఠాగూర్‌స్టేడియంలో వాకర్స్‌తో మాట్లాడిన అనంతరం సివిల్ డిపార్ట్‌మెంట్, ఏరియా ఆసుపత్రి, ఓపెన్‌కాస్ట్‌లలో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సింగరేణి కార్మికుల గొంతు పార్లమెంట్‌లో వినిపించాలంటే ఈ ప్రాంత ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య, డాక్టర్ రాజరమేశ్, సమ్మయ్య,తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌కేపీలో కార్మికులతో మాట్లాడుతున్న కొప్పుల

జిల్లా ఓటర్లు 6,49,745

- తుది ఓటరు జాబితా విడుదల
- 'అసెంబ్లీ'తో పోల్చితే 6,812 మంది అధికం



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా ఓటర్ల తుది జాబితాను అధికారులు విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్ఎస్ఆర్-2024కు అదనంగా కొత్త ఓటర్లను జత చేసి తుది జాబితాను రూపొందించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 6,49,745 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. మే లో నిర్వహించనున్న లోకసభ ఎన్నికల్లో వీరంతా తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల వరకు 6,42,933 మంది ఓటర్లు ఉన్నారు. అయితే ఈ జాబితాలో పెద్ద ఎత్తున తప్పులు దొర్లాయి. చనిపోయిన వారి పేర్లను తొలగించకపోవడం, స్థానికంగా లేకున్నా ఓటర్ల జాబితాలో పొందుపరచడం, అలాగే కొన్ని చోట్ల స్థానికంగా ఉన్న వారి పేర్లను సైతం తొలగించడం వంటివి చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగింపు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. గతంలో జరిగిన తప్పిదాలు దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అధికారులు కసరత్తు చేశారు. తొలగింపు, మార్పులు చేర్పులతో పాటు కొత్త ఓటర్లు కలిపి 6,812 అదనంగా పెరిగారు. ప్రస్తుతం జిల్లా ఓటర్ల సంఖ్య 6,49,745కు చేరింది.

741 పోలింగ్ కేంద్రాలు..

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూర్‌లో 227, బెల్లంపల్లిలో 227, మంచిర్యాలలో 287 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్ఆర్ఆర్-24 తుది జాబితా ప్రకారం ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరికి ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేయనున్నారు.

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఓటరు జాబితా వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	ఎన్ఆర్ఐ	సర్వీస్‌ఓటర్లు
చెన్నూర్	227	96,019	97,752	7	8	140
బెల్లంపల్లి	227	87,283	89,219	12	2	172
మంచిర్యాల	287	1,38,064	1,40,648	26	28	365
మొత్తం	741	3,21,366	3,27,619	45	38	677

బడి బస్సులకూ సెలవు!

- రద్దయిన ఆర్టీసీ సర్వీసులతో ప్రయాణికులకు ఇక్కట్లు

మంచిర్యాలఅర్బన్: విద్యాసంస్థలకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ఆయా రూట్లలో ఆర్టీసీ అధికారులు బస్సులను రద్దు చేశారు. దీంతో పల్లెల నుంచి నిత్యం రాకపోకలు సాగించే వారికి ఇక్కట్లు తప్పటం లేదు. సెలవులకు ముందు ఉదయం, సాయంత్రం ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడిపించేవారు. వేసవి సెలవుల కారణంగా రద్దవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

డ్రైవర్ల కొరత కారణంగానే..

మంచిర్యాల డిపోలో మొత్తం 142 బస్సులు, 181 మంది డ్రైవర్లు ఉన్నారు. ఇందులో 20 నుంచి 22 మంది వరకు నెలల తరబడి సిక్ లీవ్‌లో ఉండటంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. ఈ క్రమంలో రోజుకు ఏడు నుంచి ఎనిమిది బస్సులు డిపోకే పరిమితమవుతున్నాయి. ఉన్న డ్రైవర్లకు డబుల్ డ్యూటీలు వేస్తూ ఒత్తిడి తేవడంతో వారికి విశ్రాంతి లభించడం లేదు. ఈ క్రమంలో ఆదాయం ఉండని ఆయా రూట్లలో బస్సులను రద్దు చేసినట్లు తెలుస్తోంది.

రద్దయిన బస్సు రూట్ల వివరాలివి..

- మంచిర్యాల, ముల్కల్ల, ఆర్కే-6 మీదుగా రాజీవ్‌నగర్ మోడల్‌స్కూల్‌కు నడిచే మూడు బస్సులను రద్దు చేశారు.
- మంచిర్యాల- మందమర్రి పాలచెట్టు మోడల్ స్కూల్‌కు నడిచే సర్వీసును నిలిపివేశారు.
- మంచిర్యాల- లక్సెట్టిపేట- కొమ్ముగూడెం మీదుగా మంచిర్యాలకు వచ్చే బస్సు నిలిపివేశారు.
- లక్సెట్టిపేట- బలరావుపేట-మంచిర్యాల మీదుగా నడిచే బస్సుతో విద్యార్థులతో పాటు ప్రయాణికులకు అనుకూలంగా ఉండేది. ప్రస్తుతం ఈ రూట్ బస్సు కూడా నిలిచిపోయింది.

ప్రతి గింజనూ కొంటాం

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్
- దొనబండలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల మేరకు ప్రతి గింజనూ కొంటామని రెవెన్యూ అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. హాజీపూర్ మండలం దొనబండలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ధాన్యం తేమను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా మేరకు జిల్లా వ్యాప్తంగా 262 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 102 కేంద్రాల్లో 26 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 17బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. నిత్యం 6 నుంచి 15 లారీల వరకు దిగుమతి కోసం అందుబాటులో ఉంచామని, ఒక్కో మిల్లులో 15 నుంచి 30 మంది హమాలీలు సైతం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రత్యేకంగా మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపడుతుండగా జిల్లాలోని ప్రతి మండలానికి ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. అలాగే కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖా అధికారి వాజిద్‌అలీ, జిల్లా మేనేజర్ గోపాల్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

బూర్గుపల్లి కొనుగోలు కేంద్రం తనిఖీ

భీమారం: రైతులు పండించిన ప్రతీ వడ్ల గింజను కొనుగోలు చేస్తామని డీఆర్డీవో కిషన్ అన్నారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని కోరారు. ధాన్యాన్ని ఆరబెట్టి నిర్దేశిత తేమ ఉండేలా కేంద్రానికి తీసుకురావాలన్నారు. అలాగే దాంపూర్ కేంద్రం కింద ధర్మారంలో సబ్‌సెంటర్ ప్రారంభించామని తెలిపారు. ఇందులో ఐకేపీ ఏపీఎం త్రియంబక్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పశు సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వేసవిలో ఉష్ణోగ్రతలు అధికమవుతున్న నేపథ్యంలో పశుపోషకులు పశువుల సంరక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశువైద్య, పశు సంవర్ధకశాఖ అధికారి వై రమేశ్ ప్రకటనలో తెలిపారు. పశువులను ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6నుంచి 8 గంటల వరకు మేతకు పంపించాలని సూచించారు. అలాగే పశువుల కొట్టం, పశువులను కట్టేసే ప్రదేశంలో సరైన నీడ ఉండేలా చూసుకోవాలని, జీవాలకు ఎప్పటికప్పుడు తాగునీటిని అందించాలని, అలాగే వడదెబ్బ తగలకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎండ తీవ్రతకు గురైన పశువులను గుర్తించి వాటికి గ్లూకోజ్ ద్రావణం, ఖనిజ లవణ మిశ్రమాన్ని తాగించాలని సూచించారు.

క్లుప్తంగా

డంపింగ్ యార్డుకు నిప్పు


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఆర్కే1 గని సమీపంలో గల డంపింగ్ యార్డుకు శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో పెద్ద ఎత్తున మంటలతో పాటు దట్టమైన పొగ వ్యాపించింది. మంటలు ఎగిసిపడి సమీపంలోని సింగరేణి సీహెచ్‌పీ వైపు వ్యాపించడంతో అక్కడ ఉన్న బొగ్గు నిల్వలకు మంటలు అంటుకున్నాయి. వెంటనే ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపుచేశారు. కాగా, ఇటీవలకాలంలో తరచూ డంపింగ్ యార్డుకు ఆకతాయిలు నిప్పుపెడుతుండటంతో సమీపంలో ఉన్న ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత


ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: ప్రమాదవశాత్తు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎట్టకేలకు పట్టుకుని బాధితుడికి పోలీసులు అప్పగించారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య కథనం ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్‌నగర్ బస్తీలో నివాసం ఉంటున్న గొర్ల బానేశ్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు గత జులైలో బైక్‌పై ఇంటికి వెళ్తుండగా సెల్‌ఫోన్ పాగొట్టుకున్నాడు. దారెంట వెతికిన దొరకలేదు. ఈ ఘటనపై వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇన్నాళ్లు సదరు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండగా తాజాగా ఆన్‌చేశారు. దీంతో సమాచారం అందుకుని ఓ మొబైల్ షాపులో ఓ వ్యక్తి అమ్మకం చేసిన బానేశ్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి ఎస్‌హెచ్‌ఓ అప్పగించారు.

పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలి


యువకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

తాండూర్: విద్యావంతులైన యువకులు పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ సూచించారు. మండలంలోని బోయపల్లి గ్రామంలో విద్యావంతులకు శనివారం పుస్తకాలు, కుర్చీలు, ఇతర సామగ్రిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన యువకులతో మాట్లాడుతూ గ్రామ యువకులు ఎంతో పట్టుదలతో ఓ ఇంటిని గ్రంథాలయంగా మార్చి పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడం హర్షనీయమన్నారు. గ్రంథాలయానికి సౌకర్యాలు కల్పించిన అదనపు కలెక్టర్‌కు యువకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ అధికారి సత్యనారాయణ, కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌కు రాజీనామా

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఆ యూనియన్ బ్రాంచి నాయకుడు తొంగల రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. యూనియన్‌లో చాలా కాలంగా పనిచేశానని, ఇటీవల యూనియన్‌లో చోటుచేసుకున్న పరిణామాలతో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన రాజీనామాపత్రాన్ని యూనియన్ బ్రాంచి ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్‌కు సమర్పించినట్లు తెలిపారు.

శుభ విరామం..!

- మూఢం, ఆషాఢమాసం
- వివాహ ఘడియలకు నేడు చివరిరోజు
- ఇక ఆగస్టు వరకు ఆగాల్సిందే..



నిర్మల్‌ఖిల్లా: పెళ్లిళ్లు, శుభకార్యాలకు ఆదివారం నుంచి బ్రేక్ పడనుంది. గురుమూఢం ప్రారంభంతో జూలై 8 వరకు ఎలాంటి ముహూర్తాలు లేవని వేద పండితులు వెల్లడిస్తున్నారు. ఆ తర్వాత ఆషాడమాసం ప్రారంభం కానుండడంతో పెళ్లిళ్లు శుభకార్యాలు ఉండవు. శ్రావణమాసం ఆగస్టులో కొత్త ముహూర్తాలున్నట్లు ప్రముఖ వేదపండితుడు సముద్రాల శ్రీకాంతాచార్యులు 'సాక్షి'తో పేర్కొంటున్నారు.

గ్రహాలస్థితిని బట్టి మూఢం..

వివాహ తదితర శుభకార్యాలకు గ్రహాల స్థితిని బట్టి ముహూర్తాలు నిర్ణయిస్తారు. జ్యోతిష్యులు చెబుతున్నా వివరాల ప్రకారం గురుగ్రహం సూర్యుడికి దగ్గరగా వచ్చినప్పుడు గురుమౌఢ్యంగా, శుక్ర గ్రహం సూర్యగ్రహానికి దగ్గరగా వచ్చినప్పుడు శుక్ర మౌఢ్యంగా పిలుస్తారు. ఈ కాలాన్ని ఏవైనా నూతన పనుల ప్రారంభం లేదా వివాహ బంధం ఏర్పడడానికి అశుభంగా భావిస్తూ పనులు వాయిదా వేస్తారు. ఈ సంవత్సరం శుభకార్యాలు ఆశ్వయుజమాసంలో మొదలయ్యాయి. ఒక పుష్యమాసంలో తప్ప మిగతా కార్తీక, మాఘ, చైత్రమాసాల్లో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలు పెద్దఎత్తున జరిగాయి. కొన్ని సందర్భాల్లో అత్యవసరంగా భావించేవారు కొన్ని అనుకూలతలు దృష్టిలో ఉంచుకొని ముహూర్తాలు పెట్టుకున్నారు. అయితే గత నాలుగైదు నెలల కాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 వేలకు పైగా పెళ్లిళ్లు జరిగాయని పురోహితులు అంచనా వేస్తున్నారు.

ఎన్నికల హడావుడితో కాస్త ఉపశమనం

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల హడావుడి కొనసాగుతోంది. వీటి తర్వాత స్థానిక సంస్థలు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉండనున్నట్లు తెలుస్తోంది. అయితే వివిధ వృత్తుల్లో ఉపాధి పొందుతున్న వారికి ఎన్నికల హడావుడి ద్వారా ఉపశమనం లభించనుంది. ఇప్పటికే ఇక పెళ్లిళ్ల సీజన్‌కు విరామం ఏర్పడనుండడంతో ఎన్నికల సీజన్ మరో అవకాశంగా లభించనుంది. ప్రధానంగా పార్టీల ప్రచారం కోసం టిఫిన్లు, భోజనాలు, తయారీ టెంట్ హౌస్ సామాన్లు, వాహనాలు, కూలీల అవసరం ఉండనుంది.

ఇక ఆగస్టు 8 వరకు విరామం

ఆదివారం పెళ్లిళ్లు, శుభకార్యాలకు చివరిరోజు కావడంతో ఇక ఆగస్టు వరకు శుభకార్యాలకు బ్రేక్ పడనున్నాయి. ఆగస్టు 8 తర్వాతే జరగనున్నాయి. అప్పటివరకు వీటిపై ఆధారపడిన వృత్తుల వారు, బ్యాండ్, వాయిద్యా కళాకారులు, ఈవెంట్ నిర్వాహకులు, టెంట్ హౌస్ యాజమాన్యాలు, పూలు, క్యాటరింగ్ తదితర రంగాల్లో ఉపాధి పొందుతున్నవారు విశ్రాంతి తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు.

బీజేపీలో భగ్గుమన్న అంతర్గత విభేదాలు

- ఎన్నికల ప్రచారంలో దాడులు చేసుకున్న ముఖ్య నేతలు
- ఒకరిపై కేసు నమోదు

రెబ్బెన: బీజేపీలో ఒక్కసారిగా అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రెబ్బెన మండలంలోని నారాయణపూర్, నంబాల గ్రామాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ ప్రచారం నిర్వహించారు. నంబాలలో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా ఆత్మారాం నాయక్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కోట్నాక విజయ్ మధ్య కొన్నేళ్లుగా రగులుతున్న విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే వీరి ఇద్దరి మధ్య సోషల్ మీడియా వేదికగా మాటల యుద్ధం కొనసాగింది. ఎన్నికల అనంతరం కాస్త సద్దుమణిగినట్లు అనిపించినా.. నంబాలలో మరోసారి బహిర్గతమయ్యాయి. ఇటీవల చేరిన వారికే పార్టీ కార్యక్రమాల విషయంలో ప్రాధాన్యత ఇస్తూ ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న వారిని పట్టించుకోవడం ఆత్మారాం నాయక్.. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపెల్లి శ్రీనివాస్‌పై రుసరుసలాడినట్లు సమాచారం. అక్కడే ఉన్న కోట్నాక విజయ్ కలగచేసుకోవడంతో ఇద్దరి మధ్య ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు చేయి కూడా చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘర్షణ సమయంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, ఎంపీ అభ్యర్థి నగేశ్‌తో పాటు, జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు. వారు కల్పించుకుని ఇద్దరిని వారించడంతో ఘర్షణ సద్దుమణిగింది. ఎన్నికల సమయంలో జాతీయ పార్టీకి చెందిన ఇద్దరు ముఖ్య నేతలు బహిరంగంగా ఘర్షణకు దిగడం, భౌతికంగా దాడి చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

కోట్నాక విజయ్‌పై కేసు నమోదు

నంబాలలో నిర్వహించిన బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెబ్బెన మండలంలోని కైరిగూడకు చెందిన అజ్మీరా ఆత్మారాంనాయక్‌పై దాడి చేసిన ఘటనలో శనివారం రాత్రి వాంకిడి మండలం మోకాజీగూడకు చెందిన కోట్నాక విజయ్‌పై కేసు నమోదైనట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. అజ్మీరా ఆత్మారాంనాయక్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

తాగునీరు కలుషితం !


నీటిడ్రమ్ముపై బల్లి


క్యాంటీన్‌ల్లో అపరిశుభ్రత నీటితో ఫ్రిజ్

జైపూర్: అసలే ఎండలు దంచికొడుతున్నాయి. ఎండవేడిమికి తోడు జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ఆవరణలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం వేసవి తాపానికి నీటి కోసం కాంట్రాక్ట్ కార్మికులు అల్లాడుతున్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యత చేపడుతున్న పవర్‌మేక్ కంపెనీతోపాటు దానికి సబ్‌గా వ్యవహరిస్తున్న కంపెనీల్లో సుమారు వెయ్యిమందికిపైగా కార్మికులు ఉన్నారు. రెండు యూనిట్లలో డిపార్టుమెంట్ల వారీగా మూడు షిఫ్టుల్లో పని చేస్తున్నారు. పని ప్రాంతాల్లో కార్మికులకు డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాల ద్వారా తాగునీటి అందించడం వాటికి సరిగ్గా శుభ్రం చేయడం లేదు. క్యాంటీన్‌తోపాటు రెండ్రు ప్రాంతాల్లో ఫ్రిజ్‌లు ఏర్పాటు చేసినా నిర్వహణ సక్రమంగా లేకనే నీరు తాగే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కనీస సౌకర్యాలను కల్పించేలా చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

కనీస సౌకర్యాల్లేవు



పవర్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. పని ప్రాంతాల్లో కనీసం చల్లటి తాగునీరందించడం లేదు. ఓ వైపు ఎండవేడితో ఇబ్బంది పడుతున్నప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టింపు చేయడం లేదు. ఇక క్యాంటీన్‌ల్లో ఏదీ క్వాలిటీగా ఉండటం లేదు.

– చిప్పకుర్తి సంపత్, హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్, ఎస్టీపీపీ

గంజాయి విక్రేత అరెస్టు


పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారుడు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. పక్కా సమాచారంతోనే రైల్వేస్టేషన్ ఏ క్యాబిన్, పోచమ్మ టెంపుల్ ప్రాంతాల్లో శనివారం సీఐ సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తి వద్ద 250 గ్రాముల గంజాయి, హుక్కా లభించింది. సదరు వ్యక్తి వివరాలు సేకరించగా కలకత్తాకు చెందిన దేవనాత్ రాయ్(25) మహారాష్ట్ర నుంచి గంజాయి తెచ్చి మంచిర్యాల రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని చెప్పాడు. ఇతడు బతుకుదెరువు కోసం రైళ్లలో సమోసాలు అమ్మితే వచ్చే డబ్బులు సరిపోకనే గంజాయి అమ్ముతున్నాడు. ఈక్రమంలో అతడు గంజాయికి బానిసయ్యాడు. ఈనెల 26న బల్లార్షకు వెళ్లి 1250 గ్రాముల గంజాయి కొనుగోలు చేసుకొని వచ్చాడు. శనివారం పోచమ్మగుడి వద్ద గంజాయి తాగి అక్కడికి వచ్చే వారికి విక్రయిచేందుకు సిద్ధంగా ఉన్నాడు. పోలీసులు అతని తనిఖీ చేయగా 250 గ్రాముల గంజాయితోపాటు తాగేందుకు ఉపయోగించే హుక్కాను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన విద్యుత్ సామగ్రి


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

- కాలిబూడిదైన విలువైన విద్యుత్ సామగ్రి
- సుమారు రూ.6 లక్షల నష్టం

నెన్నెల: మండల కేంద్రంలోని బొమ్మెన శ్రీమతి రైస్ మిల్లులో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోయిన ఆస్తినష్టం వాటిల్లింది. సుమారు రూ.6 లక్షల విలువైన మెయిన్ విద్యుత్ వైర్లతో పాటు ప్యానల్ బోర్డు, విద్యుత్ స్టార్టర్‌లు, కెపాజిటర్లు, విద్యుత్ మీటర్లు కాలిబూడిదయ్యాయి. రైస్ మిల్లు యజమాని, ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..రైస్‌మిల్లులో పని చేసే ఆపరేటర్ వెంకటేశ్ శనివారం ఉదయం 4.30 గంటల ప్రాంతంలో రైస్ మిల్లుకు వెళ్లి షెటర్ ఎత్తి చూడగా మంటలు చెలరేగుతూ కనిపించాయి. వెంటనే పక్కనే ఉన్న బోర్ మోటారుతో మంటలార్పేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికే విలువైన విద్యుత్ సామగ్రి అగ్నికి ఆహుతైంది. రైస్‌మిల్లు యజమాని బొమ్మెన శ్రీమతి విచారణ చేపట్టాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయా? లేదా ఎవరైనా కావాలనే చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, విద్యుత్ ఏఈ మల్లయ్యకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఫోన్‌లో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌తో మాట్లాడారు. విచారణ వెంటనే చేపట్టి రిపోర్ట్ త్వరగా అందజేయాలన్నారు. బొమ్మెన శ్రీమతి ఆమె కొడుకు హరీశ్‌గౌడ్‌ను ఎమ్మెల్యే పరామర్శించి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరగలేదని పోలీసులకు రిపోర్ట్ ఇచ్చినట్లు విద్యుత్ ఏఈ తెలిపారు. విద్యుత్ అధికారుల రిపోర్ట్ ఆధారంగా విచారణ చేపడుతున్నట్లు ఎస్సై ప్రసాద్ పేర్కొన్నారు.

రూ.2.96 లక్షల నగదు పట్టివేత


నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై

తాండూర్: తాండూర్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న ఓ కారులో నుంచి పోలీసులు నగదు పట్టుకున్నారు. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం..తాండూర్ ఐబీ శనివారం వారసంత ప్రాంతంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మహారాష్ట్ర వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయడంతో కారులో ఉన్న శాంకరి మహేశ్ వద్ద రూ.2.96 లక్షల నగదు లభించాయని ఎస్సై తెలిపారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

కొత్త గనుల ఏర్పాటుకు కృషి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య


మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్త గనులు తీసుకురావడానికి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ కృషి చేసిందని యూనియన్ అధ్యక్షుడు వి.సీతారామయ్య తెలిపారు. శనివారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై కార్మికులను కలిసి మాట్లాడారు. కొత్త గనులు వస్తేనే సింగరేణికి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్మికులకు ఆదాయపన్ను మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులు గనులపైకి వస్తే ఈ హామీ నెరవేర్చాలని డిమాండ్ చేయాలన్నారు. సింగరేణిలో కార్మికుల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను ఈసారి ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఫిట్ సెక్రటరీ మోతే లచ్చన్న, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, దాడి రాజయ్య, సత్తయ్య, మోహన్ రెడ్డి, మల్లెత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి


వినోద్ మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని రాయల్‌గార్డెన్ సమీపంలో సంజీవయ్యకాలనీకి చెందిన యువకుడు బొమ్మెన వినోద్ (30) అనుమానాస్పదంగా మృతిచెందాడు. పట్టణ సీఐ శంకరయ్య, ఎస్సై అంజయ్య తమ సిబ్బందితో శనివారం ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకేరోజు మూడు చోరీలు


బీరువాను పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో ఒకేరోజు మూడు చోరీలు జరిగాయి. పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మున్నీ బార్ అండ్‌రెస్టారెంట్‌లో శనివారం తెల్లవారుజాము 3.30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి రెస్టారెంట్‌పై ఇనుప రేకును తొలగించి వైన్స్ గదిలో చొరబడ్డారు. రూ.3 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. రెస్టారెంట్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో దొంగతనం చేసిన వ్యక్తి ముఖానికి నలుపు రంగు వస్త్రాన్ని ధరించి ఉన్నారు. మండలంలోని భట్‌పల్లికి చెందిన తోట శోభ ఇంటి తాళం పగులగొట్టి దొంగలు బీరువా తాళం తొలగించి మూడున్నర తులాల బంగారంతోపాటు రూ.50 వేల నగదు చోరీకి గురైంది. ఫింగర్‌ప్రింట్స్, డాగ్‌స్క్వాడ్ బృందాలతో సంఘటన జరిగిన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ కరుణాకర్, పట్టణ సీఐ శంకరయ్య, రూరల్ ఎస్సై సోనియా, పట్టణ ఎస్సై అంజయ్య, మహేందర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- విద్యుత్ శాఖ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి
- కౌటాలలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

కౌటాల(సిర్పూర్): హెచ్చుతగ్గులు లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. కౌటాల మండలం కోయగూడ సమీపంలో నిర్మిస్తున్న 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గడువులోగా పనులు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కౌటాల విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాల్లో అటవీ ప్రాంతం నుంచి విద్యుత్ తీగలు ఉండడంతో ఈదురు గాలులకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వేగంగా మరమ్మతులు చేపడుతూ.. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ముందస్తు అంతరాయంపై సమాచారం ఇవ్వాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరుపై దృష్టి సారించాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పార్టీలో ప్రతీ కార్యకర్తకు ప్రాధాన్యత

- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ ఘనాటే


మాట్లాడుతున్న సంజయ్ ఘనాటే

కాగజ్‌నగర్‌రూరల్: బీజేపీలో ప్రతీ కార్యకర్తకు ప్రాధాన్యత ఉంటుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ ఘనాటే అన్నారు. పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన ఓబీసీ జిల్లా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదం కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. 27 శాతం ఓబీసీ రిజర్వేషన్ ఇప్పించిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. 27 మంది బీసీలను మంత్రులుగా తీసుకుని ఐదుగురికి కేబినెట్ హోదా కల్పించారన్నారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ ఓబీసీ నాయకుడు మోదీ మరోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. విశ్వకర్మ యోజన ద్వారా అందరికీ న్యాయం చేస్తామన్నారు. ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ సమస్య పరిష్కరిస్తామన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి గోడెం నగేశ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, సొల్లు లక్ష్మి, వీరభద్రచారి, సిందం శ్రీనివాస్, గోలెం వెంకటేశ్, విశ్వేశ్వర్‌రావు, గజ్జల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యం, నిందితులతో ఎస్సై రాములు, టాస్క్ ఫోర్స్ ఎస్సై లచ్చన్న

భీమారం: అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రూ.2 లక్షల విలువ గల మద్యం బాటిళ్లను మండలంలోని మాంతమ్మ ఆలయ సమీపంలో జాతీయ రహదారి వద్ద శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై బి.రాములు కథనం ప్రకారం.. మంచిర్యాల నుంచి మహారాష్ట్ర వైపు టాటాఏసీ వాహనంలో మద్యం తరలిస్తున్నారనే సమాచారంతో భీమారం–జైపూర్ మధ్య జాతీయ రహదారి వద్ద టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న సిబ్బందితో కాపు కాశారు. అనుమానాస్పదంగా వస్తున్న టాటాఏసీ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా మద్యం కాటన్లు లభ్యమయ్యాయి. కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన డ్రైవర్ మహ్మద్ షరీఫ్, తిప్పారపు రమణయ్యను విచారించారు. మద్యాన్ని మహారాష్ట్రకి తరలిస్తున్నామని ఒప్పుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న టాటాఏసీతోపాటు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే కు సంబంధించిన వాల్ పోస్టర్లను కాంట్రాక్ట్ కార్మికులు ఆవిష్కరించారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం చేతుల మీదుగా శనివారం శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడేను కార్మికులు ఘనంగా జరుపుకోవాలన్నారు. 12 గంటల పని విధానాన్ని నేడు బీజేపీ ప్రభుత్వం తీసుకురావడానికి కుట్ర చేస్తుందని దీన్ని తిప్పికొట్టాలన్నారు. మే 1న జరిగే కార్మిక దినోత్సవం పెద్ద ఎత్తున విజయవంతం చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకన్న, సురేష్, రాజేష్, రాంబాబు, అనిల్, సమ్మయ్య పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీఅనుకోడ గ్రామానికి చెందిన బండి సాదు (25) మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. సాదు గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 26న మద్యం మత్తులో ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతన్ని సిర్పూర్(టి)లోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తమ్ముడు హన్మంతు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

పాతమంచిర్యాల: బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్ల అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. బీసీలకు 27 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని బీపీ మండల్ కమిషన్ నివేదిక సమర్పిస్తే సిఫారసులకు మోక్షం లభించడం లేదన్నారు. నాయకులు కీర్తి భిక్షపతి, చంద్రమౌళి, సతీశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.